
# సంకెళ్ళు

-డా॥ ఆలూరి విజయలక్ష్మి



చదువుతున్న పుస్తకాన్ని విసుగ్గా పక్కన పడేసింది అన్నపూర్ణ. ఈ కథలు, వ్యాసాలు రాసే వాళ్ళు స్త్రీ తాలూకు అతిముఖ్యమైన సమస్యల్నెంత ప్రక్క దారి పట్టిస్తున్నారు! కాస్త స్వేచ్ఛగా ఆలోచించే స్త్రీ లకు బ్రెయిన్ వాష్ చేసి పథకం ప్రకారం మరిన్ని సంకెళ్ళను తగిలించాలని చూస్తున్నారు. స్త్రీ స్వేచ్ఛ, స్వావలంబన, బాహ్య జీవితం కుటుంబ విచ్ఛిత్తికి దారి తీస్తాయి కాబట్టి అలాంటి దుష్పరిమాణాన్ని నివారించడానికి స్త్రీలు ఇంటికే పరిమితమవాలని ఎంత తెగింపుతో రాస్తున్నారు! మనసంతా చికాగ్గా అనిపించి బుక్ షెల్ఫ్‌లో పుస్తకాలు తీసి సర్దుతూ మరిచిపోవడానికి ప్రయత్నించింది.

పుస్తకాలు సర్ది సోఫాలో వాలిన అన్నపూర్ణకు అలసటగా వుంది. అలసట! అవును. తీవ్రమైన అలసట. కాని ఇది ఓటమితో కూడిన అలసటకాదు. నిర్విరామ పోరాటంతో వచ్చిన అలసట. ఉనికి కోసం పోరాటం, బ్రతుకు కోసం పోరాటం, తిండి కోసం పోరాటం, చదువు కోసం పోరాటం, గౌరవం కోసం పోరాటంతో వచ్చిన అలసట.

అలా పోరాటం చేస్తూనే సాగిన తన జీవితానికి పెద్ద మలుపు పెళ్ళి. సినిమాలు, సాహిత్యం కలిసి సృష్టిస్తున్న పిచ్చి కలలు, వెర్రి సెంటిమెంట్స్ మాయా జాలానికి దూరంగా వున్న తను వివాహం గురించి, భర్త గురించి పెద్దగా మధుర స్వప్నాల్నేమీ కనలేదు. ఊహాలోకంలో విహరించనూ లేదు. తనకు ఊహ తెలిసినప్పటి నుండి తన తండ్రితో సహా అనేక మంది భర్తల్ని చూస్తూంది. వాళ్ళ మనస్తత్వాలు వేరు వేరుగా వుండొచ్చు. కానీ భార్య విషయంలో కొంచెం హెచ్చు తగ్గుల్తో వారి భావాలొకటే. అందుకు భిన్నంగా తన భర్త వుంటాడని తను అనుకోలేదు. కాని భిన్నంగా వుంటే బాగుండుననే వెర్రి ఆశ ఏమూలో దాగుండి వుంటుంది. అందుకే ప్రతి విషయాన్ని తర్కించి, ప్రశ్నించి, సబబుగా కనిపిస్తేనే ఆచరించే తనను సురేష్ కఠినంగా కసిరినప్పుడు చిన్నబుచ్చుకుంది.

"నువ్వేదో ఆకాశం నుండి ఊడపడ్డట్లు ప్రవర్తించకు. మీ అమ్మను, మా అమ్మను చూసైనా నేర్చుకో ఆడదెలా వుండాలో!" కఠినంగా అంటున్న అతని వంక విస్తుపోయి చూచింది తను. నిండా ఇరవై అయిదేళ్ళు లేని ఇతనిలో ఇంత కాఠిన్యం, స్త్రీల పట్ల ఇంత చులకన!! ఆధునిక తరానికి చెందిన ఇతను భౌతికంగా ఆధునిక ఫాషన్లను అనుసరిస్తున్నాడు కానీ ఆధునిక భావాల్ని పెంపొందించుకోలేక పోతున్నాడు.

"అమ్మలా, అత్తయ్యలా నేనెలావుంటాను? మనది కొత్త తరం. మనకు కొత్త భావాలుండాలి. కొత్త ఆలోచనలుండాలి" అతని కాఠిన్యానికి మనసు నొచ్చుకున్నా తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో అంది తను.

"ఇలాంటి ఉపన్యాసాలంటే చిరాకు నాకు." అతని ముఖంలోని అప్రసన్నతను చూచి దిగులుగా వుంది తనకు. కాని అతని ఆజ్ఞ ప్రకారం నోరెత్తకుండా పడివుండడం తన స్వభావానికి విరుద్ధం. తమ జీవితమంతా ముందుంది. ఇతని భావాల్తో రాజీ పడి బ్రతకడమంటే తను జీవచ్ఛవంలా మిగలడమే. జీవితాంతం ఇతని పెత్తనాన్ని సహిస్తూ బ్రతకాలనే ఊహే దుస్సహంగా వుంది.... కాదు. తనతని భావాల్లోని పొరపాటును ఎత్తి చూపి మంచి మార్గంలోకి తిప్పాలి. ఇతనిలో అధిక్యతా భావాన్ని పెంచి పోషించారు చుట్టూవున్న మనుషులు. ఈ సమాజంలో పాతుకుపోయిన భావజాలాన్ని గుడ్డిగా అనుకరిస్తున్నాడితను. కొత్త ఆలోచనల ద్వారాలు తెరిస్తే తన తప్పును గ్రహిస్తాడు. తనతని బానిస, దాసి, నీడ అనే భావాలకు కాలం చెల్లిపోయింది. తన తని స్నేహితురాలు, సహచరి, ఇతని కష్ట సుఖాల్ని, అనుభూతుల్ని, ఆవేదనల్ని కలిసి అనుభవించ వలసిన నేస్తం. తనతని బానిసగానో, దాసిగానో, నీడగానో మిగిలి తన వెచ్చని ఊహల్ని, స్పందనను, భావుకత్వాన్ని చంపేసుకుంటే నష్ట పోయేది తనొక్కతే కాదు. తనతో పాటు ఇతను కూడా జీవితంలోని మధురిమను కోల్పోతున్నానని గ్రహించ లేకపోతున్నాడు. భార్యా భర్తల మధ్య చక్కటి, ఆనంద ప్రదమైన బాంధవ్యం లేకపోతే ఈ సమాజం కూడా నష్ట పోతుందనే ఆలోచనే ఇతనికి రాదు. పాత కాలపు బాంధవ్యాన్ని తిరస్కరించి కొత్త బాంధవ్యాన్ని పెంపొందించుకోవడమంటే ఇతనికి భీతి, అయిష్టం. అందుకే శాసించి తన నోరు నొక్కెయ్యాలని చూస్తున్నాడు.

"మీరిలా మాట్లాడడం బాగా లేదు. మీరు స్వంతంగా ఆలోచించకపోతే పోయారు. కనీసం కళ్ళు తెరిచి జాగ్రత్తగా మీ చుట్టూ చూడండి. లోకమెంత వేగంగా మారిపోతోందో?!" అనేసాక తన మాటలు తనకే డొల్లగా అనిపించాయి. నిజమే. లోకం భౌతికంగా, వైజ్ఞానికంగా, సాంకేతికంగా శరవేగంతో మారిపోతూంది. కాని అంతే వేగంగా మనిషి మనస్తత్వం, బలంగా వేళ్ళూనుకున్న నమ్మకాలు, ఆలోచనలు మారడంలేదు. కొత్తగా వ్యాపిస్తున్న భావ పరంపర స్త్రీని కదిలిస్తున్నంతగా పురుషుడిని కదిలించడంలేదు. అందుకే తనతనితో ఈ రోజు ఘర్షణకు దిగాల్సి వచ్చింది. తనతో పాటు ఇతనూ మారుంటే తనను స్వేచ్ఛగా మాట్లాడనిచ్చే వాడు. తామిద్దరూ ప్రేమగా భావాల్ని కలబోసుకునే వారు. సంపంగి పరిమళం లాంటి స్నేహాన్ని కలిసి పంచుకునే వారు. ఒకటై అనుభూతి తాదాత్మ్యతతో మైమరచే వారు.

తనతో మాటలు పెంచడం ఇష్టం లేనట్లు కోపంగా చూచి అక్కడ నుండి లేచి వెళ్ళి పోయాడు సురేష్.

అప్పుడు ఆగిన ఘర్షణ మళ్ళీ తనకు జాబ్ వచ్చిందని తెలిసిన నాడు వచ్చింది.

"ఇప్పుడు నువ్వు జాబ్ చెయ్యాల్సిన పనిలేదు. నేను సంపాదించేది చాలు. ఇంట్లో వుండి ఇంటిని,

"పిల్లల్ని చక్క దిద్దుకుంటేచాలు." అతని ఆజ్ఞ విన్న తను ఏం అనాలో తోచక కూర్చుండి పోయింది కాసేపు. ఇతనికి పిల్లల్ని, ఇంటిని చూచుకునే భార్య మాత్రమే చాలు అనుకున్నప్పుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన తన నెందుకు చేసుకున్నట్లు?! పెద్ద ఇల్లు, ఖరీదైన కారులా చదువుకున్న భార్య కూడా స్టేటస్ సింబల్ అనా?!

"మీరు సంపాదించేది సరిపోవచ్చు. కాని నేను జాబ్ చేసేది కేవలం సంపాదనకోసం కాదు. నా ఆత్మ శక్తిని పెంపొందించుకోవడానికి. నా శక్తి సామర్థ్యాల్ని రుజువు చేసుకోవడానికి. నాతెలివి తేటల్ని, ప్రతిభని ఈ సమాజానికి ఉపయోగించడానికి. నాకై ఒక గుర్తింపును పొందడానికి. నేను చెప్పిన ఇవన్నీ కేవలం మీ భార్యగా మిగిలిపోతే పొందలేనివి." తన గుండెల్లో ఏదో ఆర్తి, పైకిరాలేని ఆక్రందన.

"స్టుపిట్. ఇలాంటి తల తిరుగుడు మాటల్ని వినడం అసహ్యంనాకు" క్రోధంతో ఎర్రబడిన అతని ముఖం వికృతంగా మారింది.

మితి మీరిన కోపంతో విచక్షణను కోల్పోయిన అతనితో మాట్లాడడం తనకూ ఇష్టం లేక పోయింది. మౌనంగా వుండిపోయి మరునాడు ఉద్యోగంలో జాయినయింది. సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చాక పెద్ద యుద్ధమే జరిగింది.

"మీరలా చిందులు తొక్కకండి. ఇందులో నేను కాని పని చేస్తున్నదేమీ లేదు. ఎంతో మంది ఉద్యోగం చేస్తున్న స్త్రీలున్నారు. నేనొక్క దాన్నే ప్రపంచానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నట్లు మాట్లాడతారేమిటి?" ఆవేశం లేకుండా అడిగింది తను. తన మాటను ధిక్కరించి ఉద్యోగంలో జాయినైనందుకు అహం దెబ్బ తిన్న అతను కోపంతో కుతకుత ఉడికి పోతున్నాడు. అతని కోపానికి చలించకుండా అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ స్పష్టంగా చెప్పిందితను,

"ఈ విషయంలో మనం పోట్లాడుకోవడం తెలివి తక్కువ. నేను జాబ్ చెయ్యకుండా ఇట్లో కూర్చోవడమన్నది అసంభవం. అంచేత ఆ విషయం వదిలి మనం ఇద్దరం జాబ్స్ చేస్తూనే ఎంత ఆనందంగా బ్రతకగలమో ఆలోచిద్దాం" తుంచేసినట్లు అని వంటింట్లోకి వెళ్ళింది తను. ఆ తరువాత చాలా రోజులు అతనితో ఇంట్లో పనులు చేయించడానికి విఫల యత్నం చేసింది.

"పనులకు "జెండర్" లేదు. 'ఆడపనులు,' 'మగపనులు' అని మనం పెట్టుకున్న పేర్లు అవి. ఇప్పుడు మన అవసరాలను బట్టి ఆ 'జెండర్'ను తుడిచేసి అందరం అన్ని పనులూ చేసుకోవచ్చు రండి. ఈ పప్పు గ్రైండ్ చెయ్యండి" అంటే మింగేసేలా చూసాడతను.

"పిల్లల్ని కనడం, పాలివ్వడం మాత్రమే మగ వాళ్ళు చెయ్యలేని పనులు. మిగతా పనులన్నిటినీ ఎవరైనా చెయ్యొచ్చు. రండి వడియాలు పెట్టుకుందాం" అని సెలవు రోజున పని పురమాయిస్తే గయిమని లేచాడు తప్పితే ముద్దు కన్నా తనతో కలిసి ఇంటి పని చెయ్యలేదు. క్రమేపీ అతని వైఖరి తనకు అలవాటయి పోయింది. నచ్చ చెప్పో బ్రతిమాలో, కవ్వించో, రెచ్చగొట్టో అతనిని మార్చుదామనుకున్న తన ఆశ అడియాసే అని తేలిపోగానే అతని దులపరింపులువిని కష్ట పెట్టుకునే అవసరం లేకుండా ఇంటి పని, ఆఫీసు పని దీక్షతో చేసుకుపోసాగింది. పాప, బాబు పుట్టాక తనకు పని రెట్టింపవడమే కాక ఆయన సణుగుడు తారస్థాయినందుకుంది. ఇల్లు శుభ్రంగా లేదనో, పిల్లలు కడిగిన ముత్యాల్లా లేరనో, వంట దరిద్రంగా వుందనో అరుస్తూ ఆ పనులకు, తన జాబ్‌కు లంకె పెట్టేవాడు.

ఆయన కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు చదువుతున్నప్పుడు ఆయనకు 'టీ' అందిస్తూ, టిఫిన్ అమర్చిపెడుతూనో పుస్తకాల్ని తిప్పుతున్నప్పుడు తనకూ చదవాలని ఆసక్తి కలిగింది. ఆయన పరీక్ష పాసయి మంచి ఉద్యోగంలో చేరినప్పుడు ఎంతో పొంగిపోయింది. అతను ఫ్రెండ్స్‌ని ఇంటికి తీసుకువస్తే సంతోషంతో అప్పటికప్పుడు గబగబ మంచి డిన్నర్ తయారు చేసి పెట్టింది. అందరూ అతనిని అభినందిస్తూంటే తననే అభినందిస్తున్నట్లు ఆనందపడింది.

పనితో సతమతమవుతూనే తనూ పరీక్షలకు చదివింది. పెద్దగా చదవడానికి అవకాశం చిక్కనే లేదు, ఏం పాసవుతాన్లే అనుకుంటున్న తను పాసయ్యానని తెలిసినప్పుడు ఎంతో సంతోషంతో అతనికావార్త చెప్పింది. ముభావంగా తను చెప్పింది విననట్లు నటించాడు. అతని తీరుగమనించగానే తన ఉత్సాహం నీరు కారిపోయింది. మిగతా అందరూ తనను అభినందిస్తున్నప్పటికీ అతని నోటి వెంట ఒక్క మంచి మాటకూడా రాక పోయేప్పటికి తను చిన్న బుచ్చుకుంది. అతనికి 'తన' తప్ప 'మన' అన్నభావం లేదు. దాంపత్యంలో 'మన' అన్నభావం లోపించినప్పుడు ఎంత అస్తవ్యస్తంగా తయారవుతుందో, ఎంత సంఘర్షణ పూరితంగా వుంటుందో తనకు క్రమేపీ అనుభవమవుతూనే వుంది.

కొత్త ఉద్యోగంలో చేరింది తను. జీతంతో పాటు బాధ్యతలు కూడా ఎక్కువయ్యాయి. టైమ్ ప్రకారం ఇంటికి వచ్చేసే అవకాశం లేదు. తనకూ తన టాలెంట్‌ని ఉపయోగించే అవకాశం వచ్చినందున ఇంకా ఎక్కువ శ్రద్ధతో, ఎక్కువ ఉత్తేజంతో ఉద్యోగ విధుల్ని నిర్వర్తిస్తూంది. అంచెలంచెలుగా పైకి వెళ్తున్నతనకు తన భర్త అండ, ఆమోదం, ఆనందం లేవనే అసంతృప్తి వెన్నాడుతూనే వుంది. తన తెలివితేటల్ని, చురుకుదనాన్ని, ప్రతిభను తన కొలీగ్స్ ఎవరైనా పొగుడుతూంటే అతను ముఖం ముడుచుకుని వేరే విషయం మీదకు సంభాషణ మళ్ళించేవాడు. బయట గెలుస్తున్నతను ఇంట్లో ఓడిపోతున్నందుకు ఎంతగానో క్రుంగి పోతున్నట్లనిపించింది. తనను తానే ఓదార్చుకుని, వెన్నుతట్టుకుని, జారిపోతున్న ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కూడదీసుకుని ముందడుగు వేసేది

కాని అదీ ఎంతో కాలం కొనసాగలేదు. ఆయనకు స్వాభావికంగా వున్న'అహంకారా'నికి 'అసూయ' ఇంతకు ముందే తోడయింది. ఇప్పుడు 'అనుమానం'కూడా మొదలయింది. తను పరీక్షలు పాసయినప్పుడు, ప్రమోషన్లు పొందినప్పుడు తన స్వంత తెలివి తేటలవల్ల, ప్రతిభ వల్ల పొందానని గర్వంగా దర్పంగా చెప్పుకున్న అతడు తన విషయం వచ్చేప్పటికి తను అలాగే పొందానని అనుకోలేదు. ఆడవాళ్లు శరీరాన్ని అర్పించితే తప్ప పైకి రాలేరన్న దుర్మార్గపు వాదనతో తన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేవాడు. తన ప్రతి కదలికను, ప్రతి మాటను నెగెటివ్ ధోరణితోనే చూచేవాడు, పైకి ఎంతో సంస్కార వంతంగా కనిపించే అతని లోపల దాగున్న మృగం తరచుగా తనపై లంఘించడం గురించి ఎవరితోనైనా చెప్పినా నమ్మరు.

ఏ విషయంలోనైనా తన మాటకూ విలువుండాలి; డూడూ బసవన్న లాగా అతని మాటలన్నిటికీ తలూపుతూ స్వంత ఆలోచనను చంపేసుకుని బ్రతకకూడదని అనుకునే తనకు, ప్రతిచిన్న అంశంలోనూ తనదే పెత్తనం, నిర్ణయాధికారం అనుకునే అతనికి మధ్య అనివార్యంగా ఘర్షణ తలెత్తేది. అలా ఘర్షణ పడ్డప్పుడల్లా ఒక సూట్ కేస్, నాలుగు చీరలు తనముందుకు విసిరి 'నా ఇంట్లో నుండి బయటికి నడువు' అని అరిచేవాడు. అతనలా అన్నప్పుడు అతనంత నిస్సిగ్గుగా ఎలా మాట్లాడగలుగుతున్నాడు అని ఆశ్చర్యపోయేది. అంతతేలికగా భార్యను బయటి పొమ్మనే కుసంస్కారాన్ని కనబరస్తున్నాడని ఆవేదన కలిగేది. తనెప్పుడూ 'తన' అన్న భావాన్ని రానీయక పోయినా ఈ ఇల్లు తనుకూడ బెట్టిన డబ్బుతో, తను'లోన్' తీసుకున్న డబ్బుతో కట్టినది. ఈ ఇంట్లో సగం వస్తువులకుపైగా తను

### గొంతులుమార్చేసే ఫోన్

జపాన్‌లో 'బీన్స్' అనే కొత్తఫోను కనిపెట్టారు. ఈ ఫోన్‌లో మీరు మాట్లాడితే, వినేవాళ్ళకి మీగొంతు మారి పోయి వినిపిస్తుంది. మీరు ఆడవాళ్లైతే, వినే వాళ్ళకి మగగొంతుకగా వినిపిస్తుంది. మీరు మగవాళ్ళయితే వినేవాళ్ళకి మీ గొంతు ఆడగొంతుకగా మారిపోయి వినిపిస్తుంది. ఈ 'బీన్స్' ఫోన్‌ని అక్కడ ముఖ్యంగా స్కూలు పిల్లలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు!

సంపాదించిన డబ్బుతో కొన్నవి. వాటినెప్పుడూ తన ఒక్కదానికే సంబంధించిన వస్తువులుగా తను అనుకోలేదు. ఇవన్నీ తమ అందరికీ చెందినవిగా తలచే తనను పదే పదే బయటికి పొమ్మంటూంటే కోపం వచ్చేది. కాని అతని మూర్ఖత్వానికి తోడు తనూ తొందరపడితే ఈ కాపురం నిలవదనే సత్యం గ్రహింపుకొచ్చి నిగ్రహించుకునేది. తమ అజ్ఞానానికి, తొందరపాటుకు పిల్లలు బలవుతారు. వాళ్ళ పసి మనసులు గాయపడతాయి. వాళ్ళ మనస్తత్వం దెబ్బ తింటుంది. వాళ్ళ ప్రవర్తన పెడదారి పడుతుంది. వాళ్ళ భవిష్యత్తు నాశనమవుతుంది. ఈ ఆలోచనతో తను ఇంతకుముందుకన్న సహనంతో ప్రవర్తించేది.

"నువ్వలా రియాక్ట్ అవకుండా వుండడం వల్ల అతను మరింత రెచ్చి పోతున్నాడు. ఒకసారి ఎదురు తిరిగి ఛడామడా కడిగేస్తే బుద్ధి తెచ్చుకుంటాడు" అంది తమ విషయం గమనించిన వదిన. ఆలోచన బుద్ధిని, విచక్షణను ఇవ్వాలి. ఛడామడా కడిగేస్తే తన కోపం, ఉక్రోషం తగ్గ వచ్చేమో కానీ ఆయన తన పొరపాటు తెలుసుకుంటారా?! ఐనా, బాధ్యత గల పెద్ద ఉద్యోగికి బ్రతుకు తాలూకు ఇంత చిన్న విషయాలు తెలియదా?

కాని క్రమేపీ తను ఓర్చుకోలేనంతగా ఆయన సూటి పోటి మాటలు విసరసాగారు. ఒక రోజు ఆగ్రహంతో కాపురం కావాలో, ఉద్యోగం కావాలో తేల్చుకోమన్నప్పుడు తన కాళ్ళ క్రింద భూమి కదులుతున్నట్లనిపించింది. తనేం అపరాధం చేసిందని ఇతనిలా మాట్లాడుతున్నాడు? కేవలం భర్త అయినందుకు, మగవాడయినందుకు ఈ విధంగా మాట్లాడగల అధికారం ఇతనికి వుందా? అసలు తనెందుకు కాపురాన్నో ఉద్యోగాన్నో ఎంచుకోవాలి? తనకు రెండూ కావాలి. అందులో ఏదో ఒకటి మాత్రమే ఎంచుకుంటే తన జీవితం అసంపూర్ణంగా వుంటుంది.

"మీరెంత అసందర్భంగా మాట్లాడుతున్నారో తెలుసా? నేను కాపురాన్నో ఉద్యోగాన్నో రెండిటిలో ఒకదాన్నే ఎంచుకోవలసిన అవసరమేమిటి?" తన ప్రశ్న విని తనను కాల్చేసినట్లు చూసాడతను.

"నువ్వు తింగురంగామంటూ అలంకరించుకుని ఊరిమీద పడి ఇల్లెలా వుందో పిల్ల లెలావున్నారో పట్టించుకోనప్పుడు ఆ ఉద్యోగాన్నే పట్టుకుని వేళ్ళాడవచ్చు కదా అని" వ్యంగ్యంగా అంటున్న అతని మాటల్లోని ధ్వని తనకు అర్ధమయింది.

"మీరు అన్యాయంగా నా మీద అభాండం వేస్తున్నారు. ఇంటిని, పిల్లల్ని నేను పట్టించుకున్నదాన్లో పదో వంతన్నా మీరు పట్టించుకుంటున్నారా? సంసారంలో ఏ బాధ్యతనూ తీసుకోకుండా కేవలం హక్కుల్ని మాత్రమే అనుభవిస్తున్న మీరు నన్నెలా నిలదీయ గలుగుతున్నారండీ?" ఆవేదనగా అడిగింది తను.

"చేస్తున్నావులే మహా బోడిపని! మిషనులాగా పరుగెత్తడం తప్పితే ఎప్పుడైనా కాస్త ప్రేమగా, తీరికగా కబుర్లు చెప్పడం, విద్యా బుద్ధులు నేర్పించడం వుండేడిస్తేనా?" అతని ధోరణి, మాటలు విచిత్రంగా అనిపించాయి. రోజుకు 17 - 18 గంటలు పని చేస్తూంది తను. మిషన్‌లాగా పరుగెత్తుకుంటూ చేస్తేనే పనులు చెయ్యడానికి టైమ్ సరిపోవడం లేదు కదా, ప్రేమగా, తీరికగా కబుర్లు చెప్పే అవకాశమెక్కడ? బహుశా ఆయన అభిప్రాయం తను జాబ్ కోసం వినియోగిస్తున్న టైమ్‌ని కూడా పిల్లల కోసం, తన కోసం ఖర్చు పెట్టమని అయుంటుంది. తను జాబ్ మానేస్తేనే ఆయన అహానికి సంతృప్తి, తను సహకరించడం వల్ల, ఇంటి బాధ్యతేమీ లేని ఆయన పెద్ద శ్రమ లేకుండా తన ఉద్యోగంలో ఒక్కొక్క మెట్టు ఎక్కగలుగుతున్నాడు. తనంతట తాను ఎటు నుంచీ ఏ సహాయమూ లేకుండా అతి కష్టం మీద మెట్లను ఎక్కడానికి ప్రయత్నిస్తూంటే తన కాళ్ళు పుచ్చుకుని క్రిందకు లాగుతున్నాడు.

"నేను పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించడం లేదు, ఇంటిని ఆదర్శప్రాయంగా నడపడం లేదు. సరే. ఒప్పుకుంటున్నాను. నేను అసమర్థురాల్ని. కాని ఎంతో విజ్ఞతవున్న మీరు ఆఫీసు పనిలేని సమయాన్ని మీ స్వంత ఆనందానికి, స్వంత పెరుగుదలకు పరిమితం చేసుకోకుండా పిల్లల కోసం, ఇంటి కోసం కొంత టైమ్‌ని ఉపయోగించ వచ్చు కదా!" సాధ్యమైనంత సౌమ్యంగా అడిగింది తను. ఏదో ఒకటి తేల్చుకోమనగానే భయంతోనో, కోపంతోనో ప్రతిస్పందించకుండా ఇలా నెమ్మదిగా తర్కానికి దిగడం ఆయన ఊహించనిది. అందువల్ల మరింత చిరాకుపడ్డాడు.

"అతి తెలివి చూపించకు. అనవసర ప్రసంగం చెయ్యకుండా ఏదో ఒకటి తేల్చుకో. ఇల్లు, పిల్లలు, సంసారం కావాలనుకుంటే జాబ్ రిజైన్ చేసి నోరు మూసుకుని ఇంట్లో పడుండు - ఉద్యోగమే కావాలి, మొగుడు, పిల్లలు అఖ్ఖర్లేదనుకుంటే తక్షణం బయటికి నడువు" అంటూ అరుస్తూ బీరువా తెరిచి నాలుగు చీరలు తీసి తన ముఖాన కొట్టాడు. అతని ఉద్రేకాన్ని చూచి, అసభ్య ప్రవర్తనను చూచి కోపం కంటే అతని అజ్ఞానానికి జాలి కలిగింది. ఇంత మూర్ఖుడు తన భర్త అయినందుకు దుఃఖం కలిగింది. అంత దుఃఖంలోనూ అతనొక్కడే అలాంటి వాడు కాదని, నూటికి తొంభై మంది భర్తలు అతని లాంటి వారు, అతని కంటే కూడా సంస్కార హీనులు వుంటారనేది మరచిపోలేదు తను. అందుకే నిగ్రహించుకుంది.

"మీరు ఆవేశంలో ఏది మంచో, ఏది చెడో మరచిపోతున్నారు.. ప్లీజ్ కూల్ డౌన్. నింపాదిగా ఆలోచించండి. ఈ ఇల్లు, పిల్లలు, మీ ఉద్యోగం, నా ఉద్యోగం మనిద్దరికీ సంబంధించినవి. మనం ఎవరికివాళ్ళం వేర్పాటుగా, స్వార్థంతో ఆలోచిస్తే ఫలితం చాలా దారుణంగా వుంటుంది." నచ్చ చెప్పడానికి ప్రయత్నించింది తను. అతను అనవసరమైన ఆవేశంలో ఊగిపోయాడు.

"యూ బిచ్! నాకే నీతులు నేర్పుతున్నావా?! గెటౌట్!" అంటూ చాలా ఉద్రేకంగా తన రెక్క పుచ్చుకుని బెడ్‌రూమ్ బయటికి లాగాడు. అతని ప్రవర్తనకు నిర్ఘాంతపోయింది తను. పిల్లలిద్దరూ ఎక్కడ వింటారోనని బిక్క చచ్చిపోయింది.

"వదలండి. ఏమిటిలా అసహ్యంగా" అంత వరకు మాటలే కాని చేతల దాకా రాని అతని ప్రవర్తన బాధాకరంగా వున్నా అతనిని విడిపించుకుని మళ్ళీ బెడ్ రూమ్ లోకి వెళ్ళడానికి ప్రయత్నించింది. మితిమీరిన ఉద్రేకంతో అతను తననొక్క తోపు తోయగానే ఆ విసురుకు తన నుదురు గుమ్మానికి కొట్టుకుని చివ్వున రక్తం చిమ్మింది. దానితో తన సహనానికి పరిమితి దాటింది. గాయపడిన మనసు, ప్రాణాల్ని జివ్వుమనిపిస్తున్న నుదుటి మీది దెబ్బ అప్పటి వరకు శతవిధాల సానునయంగా ప్రయత్నిస్తున్నతను అతి ముఖ్యమైన నిర్ణయం తీసుకునేందుకు ప్రేరేపించాయి.

"నేను తేల్చుకున్నాను. నాకు ఇల్లు, పిల్లలు, మీరు, నా ఉద్యోగం, అన్నీ కావాలి. ఇప్పుడు తేల్చుకోవలసింది మీరు. ఇవన్నీ కావలసిన నేను కావాలో, లేదో తేల్చుకోండి. నేను కావాలనుకుంటే ఇక్కడ వుండండి. వద్దు అనుకున్నారా, తక్షణం బయటికి నడవ వలసింది మీరు. నేను కాదు" తన గుండెను మండిస్తున్న ఆవేశాన్ని, ఆగ్రహాన్ని, దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ స్పష్టంగా చెప్పింది తను.

"ఎంత పొగరే నీకు!" ఉద్రేకంగా తన మీదకు రాబోయిన అతన్ని చేతులతో అడ్డుకుంది. తను మగవాడిననే అహంతో, బలంవుందనే అహంతో, తను శారీరక బలంలో అతనికి సమ ఉజ్జీకాదనే ధైర్యంతో అతను తనపై అత్యాచారం చేస్తున్నాడు. కానీ, నిజంగా తను తలచుకుంటే అతని శారీరక దాడిని తిప్పికొట్టగలదు. కానీ అంత అవివేకమైన, అనాగరికమైన పని తను చెయ్యదలచుకోలేదు.

## జల్లెడ కళ్ళద్దాలు

చలువ కళ్ళద్దాలు వేసుకున్నా ఎండ ఎక్కువయితే ఒక్కోసారి ఆ కళ్ళద్దాల వల్ల ప్రయోజనం ఉండడం లేదని విచారించి అమెరికాలో ఒక కంపెనీ వారు కొత్తరకం కళ్ళద్దాలు రూపొందించారు. ఈ కళ్ళద్దాలు ధరిస్తే - సూర్యరశ్మివల్ల కళ్లకు ఏ ప్రమాదమూ ఉండదట!- అనవసరమైన కాంతి కళ్లల్లో పడకుండా అడ్డుకుంటాయట! క్షణాలలో 44 శాతం నుంచి 88 శాతం దాకా వెలుగును ఆపి, తక్కిన వెలుగును మాత్రం కళ్లు చూసేలా చేస్తాయి!

"చాలు. ఇప్పటికే సభ్యత, సంస్కారం లేని మీ ప్రవర్తన అసహ్యంగా వుంది. ఇంకా దిగజారకండి. అనవసరంగా మాటలు మీరకండి. మీరెన్నో సార్లు బయటికి గెంటుతూ అరిచినా నేను అనకూడదని నిగ్రహించుకున్న మాటను ఇప్పుడంటున్నాను. ఇది నా ఇల్లు. గెట్ అవుట్" కఠినంగా అందితను.

క్రోధంతో కుత కుతలాడుతూ తనను నోటి వెంట ఉచ్చరించనలవికాని తిట్లు తిడుతూ సూట్ కేస్ లో బట్టల్ని కుక్కుకుని వెళ్ళిపోయాడు. తరువాత జరిగిందంతా తను మళ్ళీ గుర్తు తెచ్చు కోవడానికి కూడా వెగటుపడే సంఘటనల పరంపర. వాటివల్ల తను మనోధైర్యాన్ని కోల్పోలేదు సరి కదా, మొండి ధైర్యం వచ్చింది. 'ఇంతకంటే కోల్పోయేదేముంది!' అన్న నిర్లిప్తత వచ్చింది. జీవితాన్ని ఎదుర్కోవడానికి తెగువ వచ్చింది.

"రావచ్చా?!" గుమ్మం దగ్గర చెప్పులు విడుస్తూ అడుగుతున్న సురేంద్ర కంఠం విని ఆలోచనలలో నుండి బయటపడింది అన్నపూర్ణ.

"రండి" ఎదురుగా వున్న కుర్చీ చూపిస్తూ ఆహ్వానించింది.

"నే నిచ్చిన పుస్తకం చదివారా?" టీపాయ్ మీద వున్న ఇంగ్లీషు స్త్రీల పత్రిక పేజీలు తిప్పుతూ అడిగాడు సురేంద్ర.

"చదివాను. మీ చేతిలో వున్న మేగజైన్‌లోనూ స్త్రీలకు సంబంధించిన కథలు, వ్యాసాలు వున్నాయి. వాటిని కూడా చదివాను"

"మీ కామెంట్ ఏమిటి?" ఆసక్తిగా చూచాడు సురేంద్ర.

"ఆ పుస్తకంలోది, ఈ మేగజైన్స్‌లోది సారాంశం ఒకటే. కాలం మారింది కాబట్టి ఆడవాళ్ళు గడప దాటి బయటికి వెళ్ళొచ్చు. తండ్రి అనుమతించి నంతవరకు చదువుకోవచ్చు. భర్త అనుమతించి నంత వరకు జాబ్ చెయ్యొచ్చు. అతను అనుమతించ నప్పుడు మాత్రం మానేయాలి. ఒక వేళ జాబ్ చేసినా జీతం మీద పెత్తనాన్ని భర్తకే వదిలేయాలి. భర్తను, పిల్లల్ని, ఇంటిని లక్షణంగా చూచుకోవాలంటే పార్ట్ టైమ్ జాబ్ అయితే మేలు. ఆడవాళ్ళకు భర్త, పిల్లలు, సంసారం ముఖ్యంకానీ 'కెరీర్' ముఖ్యం కారాదు. ఒకవేళ ఎవరైనా 'కెరీర్' ముఖ్యమనుకు న్నారో మీకు భర్త, కుటుంబం, ఇంకా మాట్లాడితే పిల్లలు మిగలరు జాగ్రత్త అని బెదిరిస్తున్నారు." ఆమె చెపూంది మౌనంగా వింటూ ఆమె విశ్లేషణను గమనిస్తున్నాడు సురేంద్ర.

"పాశ్చాత్య దేశాల్లో 'స్త్రీ స్వేచ్ఛ,' 'స్త్రీ విముక్తి' అంటూ ఫెమినిస్టులు చేసిన బోధల్ని విని 'కెరీర్' నే ప్రధానంగా ఎంచుకుని ఉన్నత పదవులకు చేరిన స్త్రీలు వివాహాన్ని, కుటుంబాన్ని, పిల్లల్ని పొందలేనందుకు, తమ జీవితాలు అసంపూర్ణంగా వున్నందుకు పశ్చాత్తాపపడుతున్నారని, ఇకనైనా ఫెమినిస్టులు ఇలాంటి చెడిపోయే బోధలు చెయ్య కుండా బుద్ధి తెచ్చు కోవాలని, మన దేశంలోని స్త్రీ వాదులు కూడా పాశ్చాత్య దేశాల స్త్రీల అనుభవా ల్నుండి పాఠాలు నేర్చుకుని 'కెరీర్' ముఖ్యమను కుంటే రాగల అరిష్టాల్ని గుర్తించాలని, వివాహానికే ప్రాధాన్య మిచ్చి వివాహవ్యవస్థ, కుటుంబవ్యవస్థ నాశనం కాకుండా కాపాడాలని, అదేకదావాటిల్లో రాసుంది! లేక నేను పొరపాటుగా అర్థం చేసుకు న్నానా?"అతని జవాబు కోసమన్నట్లు ఆగింది అన్నపూర్ణ.

"మీరు సరిగ్గానే అర్థం చేసుకున్నారు. కాక పోతే వాళ్ళు డొంక తిరుగుడుగా చెప్పిన దాన్ని మీరు సూటిగా, స్పష్టంగా చెప్పారు." చిన్నగా నవ్వాడతను.

"అదే కదా నాతో వచ్చిన తంటా! మాటలు, చేతలు స్పష్టంగా వుండడం కూడా ప్రమాదకరమని చేతులు కాలాక కదా నాకు తెలిసొచ్చింది!" తనూ నవ్వింది అన్నపూర్ణ.

"ఇంతకూ స్త్రీ సమ్యల్ని ప్రక్కదారి పట్టిస్తూ నేర్పుగా వాదిస్తున్న ఈ పుస్తకాన్ని మీరు నాకెందు కిచ్చినట్లు? తొందరపాటుతో, ఆవేశంతో, మూర్ఖ త్వంతో వివాహాన్ని నాశనం చేసుకోకుండా స్త్రీ విచ క్షణతో, నిగ్రహంతో వ్యవహరించాలి అని చెప్తే అది వేరే సంగతి కానీ స్వతంత్రంగా ఆలోచించే స్త్రీని, వివాహంతో పాటు కెరీర్ కూడా ప్రధానమను కుంటున్న స్త్రీని 'వివాహ వ్యవస్థ నాశన మవడానికి నీ స్వేచ్ఛ, నీ 'కెరీర్' కారణమంటూ'! బెత్తం చూపి బెదిరించడం ఏమిటి?" అన్నపూర్ణస్వరంలో ఆవేశం చోటుచేసుకుంది.

"మీరింత బాగా ఆలోచించగలరు కదా, మీరిలా విడి పోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని మీరు గమనించడం లేదా? రేపు కొంచెం ఊహ తెలిసాక మీ పిల్లలు వాళ్ళ నాన్న నుంచి తమను వేరు చేసి నందుకు, తమకోసమైనా మీరు సర్దుకు పోనందుకు మిమ్మల్నే తప్పు పడతారు తెలుసా?" అతని మాటలు విన్న అన్నపూర్ణ ఆలోచనలో పడింది. నిజమే పిల్లలు రేపు తననే దోషిగా నిలబెట్టవచ్చు. తను పొందిన హింస, అవమానం, దుఃఖం వాళ్ళకు అప్ర ధానంగా కనిపించనూ వచ్చు. దూరమయిన తండ్రి అతి ప్రియంగా కనిపించనూ వచ్చు. అది తనకు తెలుసు. కాని.... పిల్లల సాకు చూపి తన భర్త మిత్రుడైన ఇతను తనను రాజీ పడమని సూచిస్తు న్నాడు. తను చెయ్యని తప్పుకు తనను పశ్చాత్తాప పడమంటున్నాడు.

"మమ్మల్ని కలపాలని మీరు పడుతున్న ఆరా టాన్ని నేను అర్థం చేసుకోగలను. కాని మేము విడి పోవడానికి ఎవరు కారణం?"

"వదిలేయండి. జరిగిపోయిందాన్ని తవ్వు కోవడం వల్ల ప్రయోజనం లేదు. నాకు కావలసింది మీరిద్దరూ తిరిగి కలిసి వుండడం" సురేంద్ర మాటలు విని ఆలోచిస్తూంది అన్నపూర్ణ. ఎలా ఇద్దరూ కలిసి వుండడం! ఆయన అభిప్రాయాల్లో మార్పు వస్తే కదా తాము కలిసి జీవించ గలిగేది! భార్య పట్ల గౌరవం, ఇష్టం, ప్రేమ, కనీసం భార్యను సహించగల స్వభావాన్ని అతను పెంపొందించు కున్నప్పుడు కదా తను అతనితో తిరిగి కలవడానికి ఆలోచించ వలసింది!

"మీరలా వెళ్ళ గొట్టినందుకు మరో మగాడయితే ఎన్ని పెడదారులు తొక్కేవాడో! అలాంటి వేమీ లేకుండా సురేష్‌కి కొంచెం నచ్చ చెప్పగానే మీతో రాజీ పడడానికి సుముఖంగా వున్నాడు. అందుకు సంతోషించాలి మీరు." సురేంద్ర మాటల్తో అన్నపూర్ణ హృదయంలో అగ్ని కణం రాజుకుంది. అతని భావ మేమిటో అర్థమయింది. సురేష్ మరో స్త్రీకో, స్త్రీలకో దగ్గిరవని గొప్పదనానికి తను పొంగి పోయి కృతజ్ఞతతో రుణపడివుండాలి. అతనికి బేషరతుగా దాసోహమనాలి. ఎంత చక్కటి తీర్పుమగవాడిది!.... అన్నపూర్ణ ముఖం రోషంతో ఎర్రబడింది.

"సురేంద్ర గారూ! ఈ విషయంలో ఇంక మాట్లాడేదేమీ లేదు. మా ఇద్దరికీ సఖ్యత కూర్చాలనే నెపంతో నన్ను అవమాన పరచకండి. దయచేసి వెళ్ళిపొండి." తన ఆత్మగౌరవాన్ని నాశనం చేస్తున్న, తన స్వేచ్ఛ గొంతు నులుముతున్న సంకెళ్ళను ఛేదించుకోవడానికి, తను గౌరవంగా, హుందాగా జీవించగల పరిస్థితికై పోరాడడానికి అన్నపూర్ణ ప్రయత్నిస్తూనే వుంది.



"ప్రేమలో పడ్డవాళ్ళతో వచ్చిన చిక్కే ఇది. మనసు సంతోషంతో ఉరకలు వేస్తూంటుంది. అంచేత కంటికి కనిపించిన ప్రతిదానిలోనూ కొత్త అందం కనిపిస్తూంటుంది. కల్గిన ప్రతి అనుభూతీ కొత్త ఆనందాన్ని ఇస్తుంది. ప్రేమ పొరకప్పిన కళ్ళకి ఈ లోకంలో అంతా ప్రేమతత్వంతో నిండిపోయి ప్రతీ జీవి మనల్లాగే ప్రేమించుకుంటూ బ్రతుకుతోంది అనిపిస్తుంది.

– కె. రామలక్ష్మి ('సుడిగాలి'లో)